GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

Spot Speed NEWS
MEDIA
న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
రి.నెం. 100/2020
APGVB రోడ్, మామిళ్ళగూడెం, ఖమ్మం. సెల్ : 8919710365
మా సేవలు : ఉపన్యాసాలకు పాయింట్లు,
ప్రెస్ నోట్స్, ప్రత్యేక సంచికలు, యాడ్ డిజైన్స్, పేజీ మేకింగ్
Please Subscribe : tmedia.net.in

సంపుటి : 7 | సంచిక : 62 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | ఆదివారం 03-11-2024 | పేజీలు : 3

యూనివర్సిటీల్లో నూరు శాతం

ప్రక్షాళన

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

టి మీడియా, నవంబరు 2,హైదరాబాద్ బ్యూరో:

ఉన్నత విద్యా మండలిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర యూనివర్సిటీలను నూటికి నూరు శాతం ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంచడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని యూనివర్సిటీ వీసీలతో సమావేశం నిర్వహించారు. గడిచిన పదేళ్లలో ఉన్నత విద్యా వ్యవస్థను పునరుద్ధరించడం అవసరం అని పేర్కొన్నారు. ఈ మేరకు కొత్తగా నియమితులైన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. బాలకృష్ణా రెడ్డితోపాటు అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లను జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు.చాన్సలర్ పోస్టులకు ఎటువంటి సంబంధం లేకుండా, మెరిట్, సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపికలు జరిపినట్లు సీఎం స్పష్టం చేశారు. చైర్మన్, వీసీలకు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. గతంలో విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీసీల మాదిరిగా, నేటి వీసీలు కూడా విద్యారంగంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. యూనివర్సిటీల గౌరవాన్ని పెంచే దిశగా ప్రక్షాళన చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.యూనివర్సిటీల ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని, అవసరమైతే కన్సల్టెన్సీల సేవలు పొందాలని సూచించారు. వర్సిటీలకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను పెంచే చర్యలను చేపట్టాలని సలహా ఇచ్చారు. వీసీలకు స్వేచ్ఛగా పని చేసే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతుందని చెప్పారు. అయితే, తప్పు జరిగితే తగిన చర్యలు తీసుకునే బాధ్యతను సైతం వీసీలపై ఉంచారు.ముఖ్యంగా యూనివర్సిటీలలో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, అలాంటి విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ద్వారా సదుపాయం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. యూనివర్సిటీలను నూతన దిశగా తీసుకెళ్లడం ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడానికి పునాదులు వేయాలని విసిలకు సూచించారు .

టీ మీడియా , నవంబర్ 2 ,హైదరాబాద్ : ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయిదేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారని, ఇందులో ఎటువంటి అనుమానాలు లేవని తేల్చి చెప్పారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. సీఎం మార్పుపై బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలను ఆయన ఖండించారు. రాబోయే ఇదేండ్లు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అని అంటూ ప్రతి పక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలని మాట్లాడుతున్నాయని అన్నారు..హైదారాబాద్ లోని సచివాలయంలో ఆయన మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూ, టీ ప్రభావం ప్రయత్నిస్తున్నాయి.. దీని ఫలితంగా ఆపరేషన్ సమయం తీసుకుంటోందని పేర్కొంటున్నారు. రెండో ఎన్‌కౌంటర్ దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని లార్నూలో జరిగింది.. ఇందులో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు ఆర్మీ

అయిదేళ్లూ రేవంతే ముఖ్యమంత్రి

- ఒకటిరెండు రోజులు ఆటో.. ఇటో బాంబు
- ఇందిరమ్మ ఇళ్ల యాప్ పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కప్పులో తుఫాన్ లాంటివి ప్రతి పక్షాల మాటలని కొట్టిపారేశారు.. ఇక రాష్ట్రంలో ప్రముఖ నాయకులు అవినీతి కేసుల్లో అరెస్ట్ అవుతారని తాను అన్న బాంబు ఒకటిరెండు రోజులు ఆటో.. ఇటో ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.ఇక ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కోసం తయారు చేసిన యాప్ పూర్తి అయ్యిందని పొంగులేటి చెప్పారు. ఫస్ట్ ఫేజ్?లో నాలుగున్నర లక్షల ఇండ్ల పంపిణీ చేయనున్నామన్నారు. మరో 4ఏళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. నవంబర్ 6 లేదా 7 నుంచి లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని మంత్రి తెలిపారు. నవంబర్ 20లోపే అర్హులైన లబ్ధిదారుల ఫైనల్ లిస్ట్ ఎంపిక అవుతుందని ఆయన అన్నారు.నవంబర్ 25 నుంచి గ్రౌండ్ లోకి వెళ్లి పనులు ప్రారంభమైయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన అన్నారు. కోర్ అర్బన్ తప్పా.. సాధ్యమైనంత వరకు లబ్ధిదారుల చేత ఇండ్ల కట్టడాలు ఉంటాయన్నారు. వారికి నాలుగు విడతల్లో రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. . ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభంలో రూ.లక్ష, ఫిల్లర్స్ రూ.1.25 లక్షలు, స్లాబ్ కట్టేటప్పుడు రూ.1.75 లక్షలు, తర్వాత ఇళ్లు పూర్తి అయ్యాక రూ.1లక్ష డెరెక్ట్ గా లబ్ధిదారుని అకౌంట్లో జమ చేస్తామని అన్నారు. ఇంటి స్థలం ఉన్నవాళ్లకు రూ.5లక్షలు, లేని వాళ్లకు 75 గజాల జాగలో ఇందిరమ్మ ఇట్లు కట్టిస్తామని ఆయన అన్నారు.హౌసింగ్ డిపార్ట్మెంట్ పూర్తిగా కూలిపోయిందని.. ఇప్పుడు మళ్లీ పునరుద్ధరణ చేస్తున్నామని ఆయన తెలిపారు. హౌసింగ్ డిపార్ట్మెంట్ లలో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. . గ్రామ సభలు పెట్టి బహుపేదలకు మొదటి దశ ఇండ్ల పంపిణీ చేస్తామని చెప్పారు. రాజకీయ ప్రమేయం లేకుండా ఇండ్ల పంపిణీ ఉంటుందని, . పార్టీలతో లేకుండా నిజమైన పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ అయినా, %-% ఎమ్మెల్యే అయినా లబ్ధిదారుని ఎంపిక ఎమ్మార్వో నిర్ధారణ చేయాల్సిందే అని ఆయన వివరించారు.ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా గ్రీన్ చానెల్ లో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ జరుగుతుందని చెప్పారులబ్ధి ఎంపికలో రేషన్ కార్డు తప్పనిసరి కాదని తేల్చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభానికి కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తామని పొంగులేటి చెప్పారు. కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందుతుంది అనే సంకేతాలు ఇప్పటి వరకు ఉన్నాయన్నారు. . కేంద్రం నుంచి నిదులు ఇస్తే మంచిదని, లేకున్నాతే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇండ్లను కట్టిస్తామని తెలియజేశారు.

జమ్ములో వరుస ఎన్‌కౌంటర్లు

ముగ్గురు ఉగ్రవాదులు హతం

టి మీడియా, నవంబరు 2,జమ్ముకశ్మీర్ : మరోసారి వరుస ఎన్‌కౌంటర్లతో దద్దరిల్లుతోంది. శ్రీనగర్ లోని కన్యర్ ప్రాంతంలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో ఓ విదేశీ ఉగ్రవాది ఉన్నట్లు అధికారులు తెలిపారు. నలుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లకు గాయాలయ్యాయి. గాయపడ్డ జవాన్లను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఉగ్రవాదులు నక్కిన ఇంటిని సైన్యం స్వాధీనం చేసుకుంది. మరోవైపు అనంత్‌నాగ్‌లో కూడా ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో కూడా ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. హల్కర్‌గల్లీ ప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. అయితే ఆర్మీ వెంటనే కూంబింగ్ చేపట్టింది. ఇద్దరు విదేశీ ఉగ్రవాదులను మట్టుబెట్టింది.

కాశ్మీర్ డివిజన్‌లోని రెండు చోట్ల భద్రతా సిబ్బంది, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్ డివిజన్‌లోని శ్రీనగర్ జిల్లా ఖన్యార్‌లో తెల్లవారుజాము నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. ఈ ఘటనలో ఓ ఉగ్రవాదిని భద్రతా బలగాలు హతమార్చాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 1-2 మంది ఉగ్రవాదులు దాగి ఉండే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. శ్రీనగర్ ఖన్యార్ నివాస ప్రాంతం, అందువల్ల భద్రతా దళాలు ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి ధృవీకరించింది. ఈ విధంగా మొత్తం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

సెంట్రల్ కశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఆర్మీ వాహనంపై కాల్పులు జరిగిన ఘటన తర్వాత బందిపొరలో పెద్ద ఎత్తున సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. సెంట్రల్ కాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలోని మాగంలో ఉగ్రవాదులు గత రాత్రి ఇద్దరు పలస కార్మికులపై దాడి చేసి గాయపరిచారు.. దీని ఫలితంగా దాడి చేసిన వారిని పట్టుకునేందుక ఆర్మీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది.

స్పందించిన మంత్రి రాజ్‌నాథ్‌సింగ్..

జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల తరువాత ఉగ్రదాడులు పెరిగిపోవడంపై స్పందించారు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్. సరిహద్దుల్లో పరిస్థితి పూర్తిగా అదుపు లోనే ఉందన్నారు. ఉగ్రవాదులపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నట్టు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని సందర్శించారు రాజ్‌నాథ్. అధునాతన ఆయుధాల తయారీని ఆయన పరిశీలించారు.

పత్తి కొనుగోళ్లలో అక్రమాలను సహించేది లేదు

మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

టి మీడియా, నవంబరు 2,హైదరాబాద్ బ్యూరో:

పత్తి కొనుగోళ్ల లో అక్రమాలకు పాల్పడితే ఏమాత్రం సహించేది లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ఆయన సహకార, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లులకు రైతులు తీసుకొస్తున్న పత్తిని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు.జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు మర్కెటింగ్ సెక్రటరీలు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు అవాంతరాలు ఎదురైతే వాట్సాప్ నెం.8897281111 సేవలు అందబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే ఏమాత్రం సహించేది లేదని మంత్రి వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీ), సహకార మార్కెటింగ్ సొసైటీల్లో (డీసీఎంఎస్)లలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంత సొమ్ము అయితే దోపిడీ గురైందో తిరిగి వారి నుంచే రాబట్టాలని పేర్కొన్నారు. జిల్లాకు ఒక మోడల్ మార్కెట్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.

ప్రజాధనం ధుర్వినియోగంతో ప్యాలెస్‌లు

ప్రజాకోర్టులో శిక్ష పడాల్సిందే

టీ మీడియా, నవంబర్ 2 , విశాఖ :

విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయ సేకరణ కంటే ప్రజాధనాన్ని దుర్వినియోగపరచడం నేరమా? కాదా? అనే విషయం ప్రజాకోర్టులో తేలి శిక్షించడమే సరైన నిర్ణయమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం చిన్నబోయే విధంగా గత వైసీపీ పాలకులు రుషికొండ ప్యాలెస్ నిర్మించారని దుయ్యబట్టారు.విశాఖలోని రుషికొండ భవనాలను శనివారం పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 500 కోట్లతో నిర్మించిన భవనాలను రాబోయే రోజుల్లో ఏ విధంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాస్‌రావు, పల్లా శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. దాదాపు గంటకు పైగా భవనాలను అనువణువునా పరిశీలించారు. సంబంధిత వివరాలను సీఎం అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలు జరుగుతాయన్నది ఆశ్చర్యం కలుగుతుందని, ఒక వ్యక్తి విలాసవంతమైన జీవితం కోసం,తన స్వార్థం కోసం ప్యాలెస్‌లు నిర్మించు కోవడం గుండె చెదిరిపోయే విషయాలని అన్నారు. రుషికొండ ప్యాలెస్ వాస్తవాలు బయట పెట్టడానికి మీడియా, పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు, నేను, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులు ప్రయత్నించిన సాధ్యం కాలేదని వివరించారు.సీఎం విలాసం కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి ప్యాలెస్ కట్టారని విమర్శించారు. ప్రజాధనంతో రాజులు కూడా ప్యాలెస్ కట్టుకోలేదని అన్నారు. రుషికొండ ప్యాలెస్‌లు రాష్ట్రపతి, ప్రధాని విడిది కోసమని, పర్యాటక ప్రాంతమని బుకాయించి వారి పేరును బదనాం చేశారని ఆరోపించారు. గజపతి బ్లాక్‌లో కాన్ఫరెన్స్ గదులు నిర్మించారని ఇటువంటి వైట్‌హౌజ్‌లో గాని , భారత రాష్ట్రపతినివాసంలో కూడా లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

జగన్ ఆంధ్రా ఎస్కోబార్

మంచినీళ్ల మాదిరిగా డబ్బులు ఖర్చు పెట్టిన ఆర్థిక నేరస్థుడు జగన్ ఆంధ్రా ఎస్కోబార్ అని అభివర్ణించారు. పేదల పేరు చెప్పి విలాసవంతమైన ప్యాలెసులు కట్టుకున్నాడని విమర్శించారు. ప్యాలెస్‌ను తిలకించేందుకు ప్రజలకు అనుమతి ఇస్తామని , అనంతరం అందరి అభిప్రాయాలు తీసుకుని, జగన్ ఉల్లంఘులను వెల్లడిస్తామని అన్నారు. ప్యాలెస్‌లను దేనికి వాడుకోవాలో అర్థం కావడం లేదని వెల్లడించారు. రాజకీయ ముసుగులో తప్పులు చేసి ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.

అయ్యప్ప భక్తులకు బీమా

కల్పించనున్న కేరళ సర్కారు

టీ మీడియా ,నవంబర్ 2 , తిరువనంతపురం : మకరవిళక్కు వేడుకల కోసం త్వరలోనే శబరిమల ఆలయ ద్వారాలు తెరచుకోనున్నాయి. ఈ క్రమంలో అయ్యప్ప భక్తులకు సీఎం పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం తీపికబురు చెప్పింది. భక్తులకు ఉచిత బీమా కవరేజీని వర్తింపజేయాలని నిర్ణయించింది. సీఎం అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆలయానికి వెళ్లే సమయంలో ప్రాణాలు కోల్పోయిన భక్తులకు రూ.5లక్షల బీమాను వర్తింపజేస్తారు. అలాగే, మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు అధికారులే ఏర్పాట్లు చేయనున్నారు. దేవాలయాలను నిర్వహించే ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డ్ ఈ స్పెషల్ బీమా కవరేజీ పథకానికి బీమా ప్రీమియం చెల్లించనున్నది. రెండునెలల మకరవిళక్కు ఈ నెల 16న మొదలవనున్నది. డిసెంబర్ చివరివారం వరకు కొనసాగుతుంది. కొద్దిసేపు ఆలయాన్ని మూసివేసి మళ్లీ జనవరి మూడో వారం వరకు భక్తుల కోసం ఆలయాన్ని తెరుస్తారు.ఈ సారి రికార్డుస్థాయిలో 14వేల మంది పోలీసు సిబ్బంది, వలంటీర్లు, భద్రతలో మోహరించాలని నిర్ణయించారు. సమీక్ష సమావేశానికి పలువురు మంత్రులతో పాటు ఆయాశాఖల అధికారులు హాజరయ్యారు. యాత్రికుల కోసం పార్కింగ్ సదుపాయాన్ని 10వేల స్లాట్లకు పెంచారు. అలాగే, టెంపుల్ టౌన్, చుట్టుపక్కల ఉన్న అన్ని రెస్టారెంట్లలో అన్ని దక్షిణ భారత భాషల్లో రేట్‌కార్డులు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ పట్టణం, పరిసరాల్లో భక్తులకు వైద్యసేవలు అందించనున్నారు. శబరిమలకు వచ్చే ఒక్క భక్తుడు సైతం స్వామివారి దర్శనం కాకుండానే తిరిగి వెళ్లకుండా ఏర్పాట్లు చేస్తామని మంత్రి వీఎన్ వాసవన్ పేర్కొన్నారు. వర్చువల్ క్యూ బుకింగ్ మొదలైంది.. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోని వారికి రోజుకు 10వేల దర్శనం టికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులు శబరిమల యాత్రను సజావుగా జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సముద్రమట్టానికి 914 కిలోమీటర్ల ఎత్తులో పశ్చిమ కనుమల పర్వత శ్రేణుల్లో శబరిమల ఆలయం ఉన్నది. పతనంతిట్ట జిల్లాలోని పంబా నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

హత్య చేసిన చిట్టిల నిర్వాహకుడు

● ఒంటరి అయిన వృద్ధురాలు ● బరితెగిస్తున్న హంతకులు

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

మానవత్వం రోజురోజుకు తగ్గుతూ పోతుంది. టీ తాగిన అంత సులభంగా తోటి మనిషిని మనిషి అతిహీనంగా చంపుతున్నారు. ప్రేమ కోసమో, డబ్బు కోసమో, ఆస్తి కోసమో, పదవుల కోసం తోటి మనిషిని మనుషులే మృగాలుగా వేటాడి చంపుతున్నారు. హంతకులు బయట దర్జాగా తిరుగుతూ ఉన్న బాధితులు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాజాగా వనపర్తి జిల్లా కేంద్రంలో చిట్టి పేరుతో ఒక కూలి పని చేసుకునే అమాయకుడిని 24 వేల రూపాయలు ఇవ్వలేక గొంతు నలిపి చంపిన చిట్టి నిర్వాహకుడు. కూలి పని చేస్తూ వృద్ధురాలు అయిన తన తల్లిని చూసుకుంటూ తనకొచ్చిన కూలి డబ్బుతో తన తల్లిని పోషించుకుంటూ ఎంతో అమాయకంగా జీవించే ఒక వ్యక్తిని ఈ విధంగా చంపడం కాలనీ ప్రజల మనసును కలచి వేసింది. కొడుకు మృతితో ఒంటరి అయిన తల్లి యొక్క రోదన కాలనీ ప్రజలను రోదనకు గురి చేసింది. చీటి వేసిన డబ్బులివ్వమని నిర్వాహకుడిని కోరిన వ్యక్తిని గొంతు నులిమి హత్య చేసిన సంఘటన వనపర్తిలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ కృష్ణ కథనం ప్రకారం పట్టణంలోని పేటగడ్డకు చెందిన వీరపాగ రాములు (39) మండలం అంకూరు గ్రామానికి చెందిన ఆర్ ఎంపీ శ్రీనివాసడ్డితో రూ. లక్ష చీటి వేశారు. 8 నెల వీరపాగ రాములు లకు రూ.80 వేలు కట్టారు. ఆ తర్వాత డబ్బులు చెల్లించలేదు. అనంతరం వారిద్దరూ అవగాహనకు వచ్చారు. రూ.84 వేలు చెల్లిస్తానని ఆర్ఎంపీ ఒప్పు కొన్నారు. రూ.60 వేలు వీరపాగ రాములుకు ఇచ్చారు. మిగతా రూ.24 వేలు ఇవ్వమని కోరితే డబ్బులు ఇవ్వలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గత నెల 28న రాములు ఇంటి నుంచి వెళ్లి పోయి తిరిగి రాలేదు. అదే నెల 31న చిట్యాలకు వెళ్లేదారిలోని పాలకేంద్రం వెనక మృతదేహం ఉందని ఓ వ్యక్తి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ కృష్ణ, ఎస్సై హరిప్రసాద్, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు శవాన్ని గుర్తించారు. ఈ నెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని గుర్తుతెలియని వ్యక్తులు చంపివేశారని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానితుడు శ్రీనివాస్ రెడ్డిని పోలీసులు స్టేషన్కు పిలిచి విచారణ చేయగా చీటి డబ్బుల విషయంలో గొడవపడ్డామని, గత నెల 28న రాములును కూల్డింక్ తాగుదామని పిలిచి గొంతు నులిమి చంపివేశానని ఒప్పుకున్నట్టు సీఐ తెలిపారు.

కప్పట్రాళ్లలో యురేనియం రగడ

● తవ్వకాలు వద్దంటూ ఆందోళన

టి మీడియా, నవంబరు 2,కర్నూలు బ్యూరో :

కర్నూలు జిల్లాలోని మారుపేరైన కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం తవ్వకాలు చేపట్టకూడదని గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఈ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరిపేందుకు ఇటీవల కేంద్రం అనుమతించింది. దీంతో కప్పట్రాళ్ల రక్షిత అటవీ ప్రాంతంలో యరేనియం తవ్వకాలు జరిపేందుకు 68బోర్లను సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న దేవనకొండ మండలానికి చెందిన 15 గ్రామాల ప్రజలు గత కొన్ని రోజులుగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా ఇప్పటికే రాజకీయ పార్టీలు కూడా నిలుస్తున్నాయి. ఇక యురేనియం తవ్వకాలు చేపట్టడం వల్ల పర్యావరణం కలుషితం అవ్వడంతో పాటు తాము అన్ని విధాలుగా నష్టపోతామని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. యురేనియం తవ్వకాల అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కప్పట్రాళ్ల బస్ స్టాప్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి వీరికి మద్దతుగా నిలిచారు. ధర్నాలో పాల్గొన్నారు. యురేనియం తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు.

నిరుద్యోగ యువతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందని, ఈ క్రమంలోనే చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు, ప్రైవేటు పరిశ్రమంలో ఉపాధి కల్పన కోసం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు అవగాహన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని అర్జీ గార్డెన్లో ఏర్పాటు చేసిన చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల ఏర్పాటు అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్యలలో ఎంతో ప్రావీణ్యం ఉండి, సరైన ప్రోత్సాహం లేక వెనకబడి పోయే నిరుద్యోగ యువతి యువకులకు స్వయం ఉపాధి, చిన్న మధ్యతర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలు సంబంధిత బ్యాంకర్లు సానుకూలంగా ఉన్నారని వారు కల్పించే ఈ అవకాశాన్ని యువకులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వనపర్తి నియోజకవర్గం నుంచి ఈ కార్యక్రమానికి హాజరైన యువతి యువకులు గ్రామాల్లోని అందరికీ అవగాహన కల్పించాలని అవసరమైతే మరో వారం రోజుల్లో మరో కార్యక్రమం నిర్వహించుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటులో వనపర్తి నియోజకవర్గం ముందుండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారుకార్యక్రమంలో డి సిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కార్యక్రమానిర్వాహకులు అవార్డు ఏజెన్సీ సభ్యులు,పారిశ్రామికవేత్తలు, పలు బ్యాంకుల మేనేజర్లు, చీఫ్ మేనేజర్లు, అధికారులు వనపర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు సీనియర్ నాయకులు కార్యకర్తలు యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు.

1,50,000 ల సామాగ్రి అందజేసిన విద్యార్థి

టీ మీడియా ,నవంబర్ 2 ,ఆత్మకూర్:

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో చదువుకున్న వెంకట్ రాములు అనే విద్యార్థి ప్రస్తుతం బెంగళూరులో కెనరా బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గా ఉన్నాడు. తాను చదువుకున్న బడికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో 1,50,000తో విద్యార్థులకు బెంచీలు,బీరువా కంప్యూటర్, కుర్చీలు టేబుల్లు, ఫిల్టర్ వాటర్ ట్యాంక్ ఇప్పించాడు. గురువులకు శాలువాలతో సత్కరించి, నాకు విద్య నేర్పించిన గురువులందరి ఆశీర్వాదాలు కావాలని, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయిలో ఉన్నానంటే ఈ గురువులు నేర్పిన విద్యనే అని అన్నారు. అలాగే ఆత్మకూర్ లో కెనరా బ్యాంక్ పెట్టుటకు ప్రయత్నిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు వెంకట్ రామారావు, బాబు దేవిదాస్, గోపాల్ రెడ్డి ప్రస్తుత ఎంఈఓ కొండాపురం బాలరాజ్, హై స్కూల్ ఉపాధ్యాయ బృందం, చిన్ననాటి స్నేహితులు రూమ్మేట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేధించే వారికి కఠిన చర్యలు

● ఆసిఫాబాద్ షీ టీం ఇంచార్జ్ సునీత

టీ మీడియా,నవంబర్ 2,కొమురం భీమ్ ఆసిఫాబాద్ క్రైమ్:

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస్ రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు,జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో ఆసిఫాబాద్ జిల్లాలో షీటీమ్ ద్వారా ఆసిఫాబాద్ మండలంలో గల బాబాపూర్ మైనార్టీ స్కూల్ నందు శనివారం విద్యార్థినులకు,మరియు పిల్లల పై జరుగుతున్న లైంగిక నేరాలు,తీసుకోవలసిన జాగ్రత్తల పై షి టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ షీటీమ్ ఇంచార్జ్,ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ సునీత మాట్లాడుతూ మహిళలు,పిల్లల రక్షణ మరియు భద్రత కోసం షీ టీమ్స్,భరోసా సెంటర్ పనిచేస్తున్నాయని తెలిపారు. ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,పోక్సో,గుడ్ టచ్ బ్యాడ్ టచ్,టి సేఫ్ అప్,ఆత్మహత్యలు,డ్రగ్స్ ,బాల్య వివాహాలు,వరకట్నం చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలు, మహిళలను ఇబ్బందులకు గురి చేసేవారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్ లేదా లైంగిక వేధింపులకు గురైనచో భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని,కొత్త వారిని గుడ్డిగా నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక దురాచారాల నిర్మూలన,కుటుంబ అనుబంధాలు,సైబర్ నేరాలపై, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 1930 పై,మహిళలు మరియు బాలికలను ఎవరైనా వేధిస్తే ఆసిఫాబాద్ షి టీమ్ నంబర్ 8712670564, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళల గురించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.పుష్పలత,మరియు పాఠశాల ఉపాధ్యాయులు,షీ టీం సభ్యులు శ్రీలత స్వప్నలు పాల్గొన్నారు.

ఎస్పితో మాజీ మంత్రి భేటీ

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

మాజీమంత్రి నిరంజన్ రెడ్డి శనివారం జిల్లా ఎస్పిని దీపావళి పండుగ సందర్భంగా వారి కార్యాలయానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,మాజీ ఎం.పి.టి.సి ధర్మా నాయక్,మాజీ కౌన్సిలర్ ఉంగ్లమ్. తిరుమల్, నాయకులు మహేశ్వర్ రెడ్డి, జోహేబ్బ హుస్సేన్, సయ్యద్. జమీల్,మాజీ సర్పంచ్ పద్మ వెంకటయ్య, చిట్యాల. రాము, గోర్ల.ప్రేమ్ కుమార్,వజ్రాల.రమేష్ఉన్నారు.

హత్యకు గురైన కుటుంబాన్ని పరామర్శ

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

చిట్టి డబ్బులు ఇవ్వమని కోరితే గొంతు నులిమి హత్యకు గురైన వీరపాగ రాములు కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అజ్జపాగ లక్ష్మణ్ , మహాజన సోషలిస్ట్ పార్టీ వనపర్తి జిల్లా కన్వీనర్ గంధం గట్టయ్య,ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. . ఇది ఒకరు చేసిన హత్య కాదని వారి వెనుక ఇంకా కొందరు ఉన్నారని అనుమానంతో వారి కుటుంబ సభ్యులు తెలపడం జరిగింది. కారణమైన హంతకులను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) వనపర్తి జిల్లా కమిటీ పక్షాన ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి పారితోషకం ప్రభుత్వం పరంగా స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికపరంగా జరిగిన నష్టానికి పారితోషికం ప్రభుత్వపరంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు , 2.50 లక్షలు ఇవ్వాలని ఆ కుటుంబాల్లో చదువుకున్న వ్యక్తికి ఉద్యోగం కల్పించాలని 4ప్రభుత్వం అందించే అంబేద్కర్ అభయాస్తం పథకం అమలులోకి వచ్చిన వెంటనే మొదటి స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో వనపర్తి జిల్లా అనుబంధ సంఘాల వనపర్తి జిల్లా దళిత సంఘాల ఐక్యతతో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టు స్వామి మాదిగ ,విరపాగ కరుణాకర్ ,కొమ్ము పవన్,మహేష్ ,చెన్నయ్య,బంధుమిత్రులు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేకూర్చేందుకే కుటుంబ సమగ్ర సర్వే

● ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నా రెడ్డి

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోవు సమగ్ర కుటుంబ సర్వే ప్రజలకు మేలు చేకూర్చేందుకేననీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నా రెడ్డి , ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే పై సలహాలు,సూచనలు కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నా రెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డితో పాటుగా ప్రజా,కుల సంఘాల పెద్దలు,ప్రతినిధులు, మేధావి వర్గం, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్వహించిన సర్వే ఫలితాలను వెల్లడించలేదని, తద్వారా కొన్ని వర్గాల ప్రజలకే లబ్ధి చేకూరిందని విమర్శించారు. నవంబర్ 6 వతేది నుండి ప్రారంభించే కుటుంబ సమగ్ర సర్వే దా.మా.శా ప్రాతిపదిక నిధుల కేటాయింపు,సంక్షేమ పథకాలు అమలుకు తోడ్పడుతుందని తెలిపారు. కుటుంబ సర్వే లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస పార్టీ ఓబీసీ సెల్ జాతీయ సమన్వయకర్త కేతురి వెంకట్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ , మున్సిపల్ చైర్మన్ ,కౌన్సిలర్లు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు,నాయకులు, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు, న్యాయ వాదులు, ఉద్యోగులు,మేధావులు,నిరుద్యోగులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు పెద్దపీట వేసిందని మండలానికొక ఎడ్యుకేషనల్ హబ్ ను ఏర్పాటు చేసి నిరుపేదలందరికీ ఉన్నత విద్యను అందించేందుకు చర్యలు చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి చిట్యాల గ్రామ శివారులోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు గౌరవ వందనంతో ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు ఉత్తమమైన మార్గాలను ఎంచుకొని వాటి దిశగా చదువును కొనసాగించాలని సూచించారు. విద్యతో పాటు ప్రతి విద్యార్థికి ఆటలు కూడా ఎంతో అవసరమని నేడు ఆటలలో విద్యార్థులను జాతీయ స్థాయిలో తర్ఫీదు నందించేందుకు, విదేశాలకు పంపేందుకు సైతం తమకు మన హక్కు అన్ని అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేగా తాను, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్గా శివసేన రెడ్డి ఉన్నారని క్రీడల్లో నైపుణ్యం గల విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని పూర్తిస్థాయిలో ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఉన్నత విద్య క్రీడలపై మాత్రమే దృష్టి సారించాలని మొబైల్ ఫోన్ను కేవలం మాట్లాడేందుకు ఉపయోగించాలని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విధులు నిర్వహించిన పూర్వపు ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం విద్యార్థులతో మమేకమైపోయిన ఎమ్మెల్యే కాసేపు వారితో సెల్ఫీలు దిగుతూ గడిపారు. ఈ సందర్భంగా తమకు డైట్ చార్జీలు 1330 రూపాయలకు పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. వనపర్తి మున్సిపాలిటీ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ మండలాల నాయకులు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం

టీ మీడియా ,నవంబర్ 2 ,పెద్ద దోర్నాల :

పెద్ద దోర్నాల స్థానిక మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేకంగా విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్.డాక్టర్ . యగ్నిక్. మాట్లాడుతూ. పాఠశాలలో విద్యార్థులతో మరియు పాఠశాల సిబ్బంది తో. పిల్లల ఆరోగ్య జాగ్రత్తల పట్ల ఏవిధంగా ఉండాలంటూ వైద్య సిబ్బంది విద్యార్థులకు తెలియజేశారు. వంట సిబ్బందితో. భోజనాలు చేసేటప్పుడు వంట పాత్రలు శుభ్రంగా చేసి వంట చేయాలని అంతేకాకుండా పాఠశాలలో శుభ్రంగా ఉంచుతూ ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు..ప్రతిరోజు త్రాగునీటి ట్యాంకును శుభ్రం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు గురించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. మెడికల్ ఆఫీసర్. డాక్టర్. యగ్నిక్. ఆశ కార్యకర్తలు. పర్యవేక్షణ సిబ్బంది. భరత్. వెంకటేశ్వర్ రెడ్డి. మంత్రు నాయక్. కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో జిల్లెల చిన్నారెడ్డి

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :

వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల స్కూల్ లో 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించడం జరిగింది. చిట్యాల గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్ ఆహ్వానం మేరకు సిల్వర్ జూబ్లీ వేడుకలో పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు .స్కూల్ సిబ్బంది చిన్నారెడ్డిని శాలువాతో సన్మానం చేసి మెమంటో ఇవ్వడం జరిగింది. చిన్నారెడ్డి మాట్లాడుతూ ఈ చిట్యాల గురుకుల స్కూల్ ఇక్కడికి రావడంలో ఈ గ్రామస్థులను ఒప్పించి, పిల్లలకు వారి తల్లి తండ్రులకు ఇబ్బందులు రావొద్దు అనే ఉద్దేశ్యంతో అపుడు ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడ చిట్యాల గురుకుల స్కూల్ లో వసతులు, ఆటస్థలం, విద్య అన్నీ కూడా బాగుంటాయి, ఇక్కడ చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థాయిలో వెళ్లడం జరిగింది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల అర్సీఓ లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లి, తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో దొంగతనం

టీ మీడియా ,నవంబర్ 2 , పెద్ద దోర్నాల:

దోర్నాల మండలంలోని చిన్న దోర్నాలలో దొంగలుహల్చల్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోనిరెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పసుపులకోటేశ్వరరావు ఇంట్లో ఒక ఉంగరం మూడు జతల మూడు మాటీలు, రెండు వెండి ఉంగరాలు చోరీ చేశారు. అలాగేపొదిలిఅనంతరాయుడుఇంట్లో ఒక ఉంగరం , ఒకజత కమ్మలు అపహరించుకుపోయారు. శనివారంఉదయం గమనించిన గ్రామస్థులు పోలీసులకుసమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మహిళ శక్తి పథకంతో ఆర్థికాభివృద్ధి

● ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

టీ మీడియా, నవంబర్ 2 ,కొత్తకోట:

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు 1 కోటి 2 లక్షల రూపాయల చెక్ లను మహిళా సంఘాలకు అధికారులతో కలిసి పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఇందిరా మహిళ శక్తి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మహిళ శక్తి పథకం ఆర్థిక చేయూతనందించి ప్రోత్సహిస్తుందన్నారు. మహిళలు మహిళ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా సంఘం సభ్యులు వ్యాపారాలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం కొన్ని పథకాలను ప్రవేశపెట్టిందాని, మహిళ ఇందిరా శక్తి పథకం'లో పెరటికోళ్ల పెంపకం, ఇందిరా డెయిరీ, మిల్క్పార్లర్లు, మహిళ క్యాంటీన్ తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు, మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుని వ్యాపార రంగంలో రాణించాలన్నారు. మహిళా సాధికారతలో భాగంగా మన ప్రభుత్వం స్కూల్ యూనిఫామ్ లను కుట్టే బాధ్యత, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలను తమ ప్రభుత్వం ఐకేపీకి అప్పగించిందన్నారు. అంతేకాక ఔత్సాహిక మహిళలు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు శిల్పారామంలో ప్రత్యేక స్టాల్ లను ఏర్పాటు చేశామని తెలియజేస్తూ మహిళా సంక్షేమమే తమ ప్రభుత్వ ధేయ్యమని తెలిపారు.

కుల గణన సర్వేతో సరికొత్త వెలుగు

● సమానత్వం దిశగాఅడుగులు ● ఎమ్మెల్యే శ్రీ. చింతకుంట విజయరమణ రావు

టీ మీడియా, నవంబర్ 2, పెద్దపల్లిబ్యూరో:

జిల్లా కేంద్రంలోని ఆర్ . కే గార్డెన్స్ లో పెద్దపల్లి డిసిసి అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ రాజ్ ఠాకూర్ గారితో కలిసి కుల గణన సమగ్ర కుటుంబ సర్వే పై పెద్దపల్లి జిల్లా స్థాయి విస్తృత మరియు రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సమగ్ర కుల గణన ద్వారా ఇంటింటి సర్వే అవశ్యకతను అలాగే ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీల విధంగా కుల గణన చేసి ఎన్రోల్మెంట్ అధికారులతో ప్రతి ఇంటికి గడప కి వెళ్లి సమగ్ర సర్వే అంశాలను నాయకులకు, కార్యకర్తలకు వివరించిన గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ..అనంతరం గౌరవ ఎమ్మేల్యేలు పలు కుల సంఘాల నాయకులు, మేధావులు కుల గణన పట్ల సలహాలను సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ల చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూపా, గండు సంజీవ్ తొట్ల తిరుపతి యాదవ్, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, కాదర్ల శ్రీనివాస్, బుషణవెన రమేష్ గౌడ్, సమా రాజేశ్వర్ రెడ్డి, వేగొళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, గజవెన సదయ్య, సురేష్

సాగర్ టూ శ్రీశైలం

- కృష్ణా నది అలలపై అందాల ప్రయాణం

టీ మీడియా, నవంబర్ 2, నాగార్జున సాగర్ :
నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణ నదిలో బోటులో ప్రయాణం.. చుట్టూ ప్రకృతి అందాలు, చల్లటి గాలి ఊహించుకోవడానికే ఎంతో అద్భుతంగా ఉంది కదూ! ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తున్న ఈ అద్భుత క్షణం రానే వచ్చేసింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ బోటు ప్రయాణం అందుబాటులోకి వచ్చేసింది.తెలంగాణ టూరిజం ఈ టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. కార్తీక మాసం తొలి రోజును పురస్కరించుకొని అధికారులు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. నిజానికి గడిచిన కొన్నేళ్ల నుంచి ఈ బోటును నడిపించేందుకు ప్రణాళికలు వేశారు. అయితే కరోనా, ఆ తర్వాత సరైన వర్షాలు లేని కారణంగా బోటు ప్రయాణం వీలుపడలేదు. అయితే తాజాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీరు అందుబాటులో ఉండడంతో బోటు ప్రయాణాన్ని ప్రారంభించింది. సుమారు 120 కిలోమీటర్ల మేర ఈ ప్రయాణం ఉంటుంది. నాగార్జున సాగర్‌లో ప్రారంభమయ్యే ఈ బోటు ప్రయాణం నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంతాల మీదుగా ఉంటుంది. ఇక మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ఇవాళ ప్రారంభించారు.

ప్యాకేజీ వివరాలు

ప్యాకేజీ ధర విషయానికొస్తే.. బోటు ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా నిర్ణయించారు. పూర్తి వివరాలు, బుకింగ్ కోసం తెలంగాణ టూరిజం అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని అధికారులు తెలిపారు. అయితే.. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. నేరుగా హైదరాబాద్ నుంచి కూడా టూర్ ఆపరేట్ చేస్తున్నారు.

మెట్రో రెండో దశ నిర్మాణానికి రూ. 24,269 కోట్లు

- ప్రభుత్వం గ్రీన్ సిగ్నల

టీ మీడియా ,నవంబర్ 2 హైదరాబాద్ :
మెట్రో రైలు కొత్త మార్గాల పనులకు పరిపాలన అనుమతి లభించింది. ఐదు మార్గాల్లో మెట్రో రెండో దశ పనులు ప్రారంభం కానున్నాయి. కారిడార్ 4లో నాగోల్ %-% శంషాబాద్, కారిడార్ 5లో రాయదుర్గం %-% కోకాపేట, కారిడార్ 6లో ఓల్డ్ సిటీ ఎంజిబిఎస్ %-% చాంద్రాయణగుట్ట, కారిడార్ 7లో మియపూర్ %-% పఠాన్ చెరు, కారిడార్ 8లో ఎల్బీ నగర్ %-% హయత్ నగర్, కారిడార్ 9లో ఎయిర్ పోర్టు %-% ఫోర్త్ సిటీ రానున్నాయి.మొత్తం నాలుగు కారిడార్లు 76.4 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగనుంది. ఎయిర్ పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కిలోమీటర్లు.. మొత్తం ఐదు కారిడార్లు 116.4కిలోమీటర్ల కొత్త మెట్రో మార్గాల నిర్మాణం జరుగనుంది. రెండో దఫా మెట్రో నిర్మాణానికి 24,269కోట్ల రూపాయల అంచనాలకు ప్రభుత్వ అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం 7333 (30%), కేంద్రం 4230 కోట్లు (18%), 11693 (48%)కోట్లు అప్పు, 1033 కోట్లు (4%) ప్రైవేట్ సంస్థలు తీసుకురావాలని నిర్ణయించారు.హైదరాబాద్‌లో రెండో దశ మెట్రో రైలును నాలుగేళ్లలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఆరు కారిడార్లలో మొత్తం 116.4 కిలోమీటర్ల

మేర మెట్రో లైన్‌ను నిర్మించాలని భావించింది. ఇప్పటి వరకు ఐదు కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమైంది. మొదటి దశలో గత ప్రభుత్వాలు రూ.22,000 కోట్లతో పీపీపీ మోడల్‌లో మూడు కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించాయి. ప్రస్తుతం రోజూ దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోను వినియోగిస్తున్నారు.

బోడుప్పల్‌లో అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మంత్రి శ్రీధర్‌బాబు

టీ మీడియా, నవంబర్ 2 ,హైదరాబాద్:
తెలంగాణలో పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని.. తాము పది నెలలలో చేశామని శాసనసభావ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు రూ.6.68 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు.గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వకుండా, తమ బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. రూ.13 కోట్లతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలతో పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల 5వేల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ నాయకులు మల్లిపెద్ది సుధర్ రెడ్డి, హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్ దారులు మహా ధర్నా

- అందె రాంబాబు

టీ మీడియా, నవంబర్ 2, వనపర్తి బ్యూరో :
వికలాంగుల హక్కులు పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకువనపర్తి జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన వికలాంగుల 6000 వేలు వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు చేనేత గీత కార్మికులు 4000వేల పెన్షన్లు సాధనకై ఆసరా పింఛన్ల దారుల ఆవేదన సభకు అధ్యక్షత వహించిన ప్రభాకర్ శెట్టి వనపర్తి జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అందె రాంబాబు పాల్గొని మాట్లాడుతూఈ నెల 17 తేదీ నుండి 23 వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నందు రిలే నిరాహార దీక్షలు చేయాలని పిలుపు నిస్తున్నాను. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే నవంబర్ 26 న వికలాంగుల చేయూత పెన్షన్ దారులు మహా ధర్నా ఇందిరాపార్కు కేంద్రంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోకొమ్ము చెన్నకేశవులు, గట్టు స్వామి,నరేందర్ ,పి బిచ్చా నాయక్ ,విజయ్ భాస్కర్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ ,బి శంకర్ యాదవ్ ,కృష్ణయ్య,గోపీనాథ్, గంధం లక్ష్మయ్య ,కృష్ణవేణి ,శ్రీనివాసులుజనార్ధన్ ,విజయ్ కుమార్ ,అన్నపూర్ణ , వికలాంగులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్తల్‌ను కోస్తా ఆంధ్రా లాగా మారుస్తా

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

టీ మీడియా, నవంబర్ 2 ,మక్తల్:
మక్తల్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో తెలంగాణ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్న 40వేల చేప పిల్లలను వదిలిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మక్తల్ మత్స్యకారులతో కలిసి మక్తల్ పెద్దచెరువులో విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేప పిల్లలను కోట్ల రూపాయల బకాయిలు పెట్టినందున ఇప్పుడు చేప పిల్లలను అందించడానికి మత్స్యకారులు ఎవరు ముందుకు రావడం లేదని, ప్రస్తుత ప్రభుత్వము చేప పిల్లల్ని సప్లై చేసే వారిని గాని మత్స్యకారులను గాని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రయత్నం చేస్తామని మత్స్యకారుల ఈ మధ్య పరిశ్రమ వారి కుటుంబ అభివృద్ధికి మరియు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుందని మక్తల్ను కోస్తా ఆంధ్ర లాగా మారుస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంతోనే నా బిడ్డ చనిపోయింది..

- వైద్యురాలపై చర్యలు తీసుకోవాలి
- బాధిత గర్భిణీ హరిత ఆరోపణ

టీ మీడియా, నవంబర్ 2 ,మల్హార్ రావు/కాటారం:
కాటారం ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి మౌలిక నిర్లక్ష్యంతోనే నా బిడ్డ చనిపోయిందని బాధిత గర్భిణీ హరిత ఆరోపించారు. బాధితురాలు మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం కాటారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డెలివరీ కోసం అడ్మిట్ కావడం జరిగిందని తెలిపింది. ప్రసూతిలో వైద్యాధికారి, సిబ్బంది అంతా కలిసి నా బిడ్డను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. నిండు గర్భిణీ ఐయిన తనను డెలివరీ కోసం ఆస్పత్రికి వెళ్లితే డాక్టర్ మౌనిక డెలివరీకి కొంత సమయం పడుతుందన్నారు. పురిటి నొప్పులు వచ్చేవరకు ఎదురు చూడాలి తప్పదు అంటూ డాక్టర్ తో పాటు హాస్పిటల్స్ సిబ్బంది నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారని ఆ యువతి చెప్పుకొచ్చింది. వాళ్ళు పెట్టే ఇబ్బందులు అన్నీ చెప్పుకోలేక పోతున్నానని కిన్నీరుమున్నీరైంది. ఈ పురిటి నొప్పులు భరించడం నా వల్ల కావట్లేదని చెప్పినా వినకుండా హింసాత్మకమైన వైద్యం అందించే ప్రయత్నం చేశారని ఆరోపించింది. ఏన్ని సార్లు నన్ను వేరే హస్పిటల్ కు పంపించండి అని మొత్తుకున్నా వినకుండా శనివారం నా పాప ప్రాణం తీశారని, చివరికి నా పాప ప్రాణం పోయాక అప్పుడు నన్ను భూపాలపల్లి పట్టణంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అప్పటికి నా పరిస్థితి విషమంగానే మారింది. అప్పటికప్పుడు 100 పడకల ఆస్పత్రి డాక్టర్, అక్కడి సిబ్బందే నన్ను బ్రతికించారని చెప్పుకొచ్చింది. కాటారంలోనే ఉంటే అక్కడి డాక్టర్, సిబ్బంది అంతా కలిసి నా ప్రాణం కూడా తీసే వారమో అంటూ బోరున విలపించింది. ఇలాంటి డాక్టర్, సిబ్బంది కారణంగానే ప్రజలకు ప్రభుత్వ హాస్పిటల్లపైన నమ్మకం పోతుందని ఆ యువతి ఆవేదన వ్యక్తం చేసింది.

వర్గీకరణ చేసే వరకు యుద్ధం ఆగదు

- ఎం.ఆర్.పి.ఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

టీ మీడియా ,నవంబర్ 2 ,జన్నారం :
ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేస్తామని ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ధర్మ యుద్ధ సదస్సు మండల కేంద్రంలోని జ్యోతి ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ%%% ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చి తప్పారన్నారు. మాటలతో మభ్యపెడుతున్నారని, వర్గీకరణ పూర్తయ్యే వరకు రాష్ట్ర ఉద్యోగ నియమకాలు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.30ఎండ్లుగా ఎన్నో ఉద్యమాలు చేసిన ఫలితంగా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ మాదిగ, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొండ బ్రహ్మయ్య మాదిగ, నిర్మల్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శి జంగం రవి మాదిగ, ప్రచార కార్యదర్శి ముల్కాల రమేష్ మాదిగ, సీనియర్ నాయకులు మంద చిన్నయ్య మాదిగ, మామిడిపల్లి ఇందయ్య మాదిగ, దుమ్మల ఎల్లయ్య మాదిగ, దూమల్ల రమేష్ మాదిగ, మంద రాజేష్, శ్రీపల్లి అంజన్న మాదిగ, కొండుకూరి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కారులో 24 కోట్ల ఖరీదైన వజ్రాలు, నగలు

- సీజ్ చేసిన ఈసీ బృందం

టీ మీడియా ,నవంబర్ 2 , ముంబై:
మహారాష్ట్రలో ఎన్నికల సంఘం అధికారులు ఓ కారులో ఉన్న విలువైన ఆభరణాలను సీజ్ చేశారు. ఆ కారులో వజ్రాలు, బంగారం, వెండి, ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు 24 కోట్లు ఉంటుందన్నారు. అహల్యానగర్ జిల్లాలో ఉన్న ఓ టోల్‌బూత్ వద్ద ఎన్నికల సంఘానికి చెందిన స్టాటిక్ సర్వియలెన్స్ బృందం కారులో సోదాలు చేపట్టింది. ఆ కారులో ఉన్న సుమారు 24 కోట్ల ఖరీదైన ఆభరణాలను ఈసీ బృందం సీజ్ చేసింది. సుపా టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. నవంబర్ 20వ తేదీన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్టీ పోలీసుల్ని మోహరించారు. కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. వజ్రాలు, బంగారం, సిల్వర్ జ్వలరీకి చెందిన కన్‌సైన్మెంట్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు. దక్షిణ ముంబైలోని జావేరి బజార్ నుంచి ఆ వాహనం స్టార్ట్ అయినట్లు సుపా పోలీసు అధికారి అరుణ్ అవద్ తెలిపారు. ఆభరణాలకు చెందిన రశీదు చూపించాలని కోరగా, కొన్ని రశీదులను చూపించారని, కానీ ఆ రశీదుల్లో ఉన్న అమౌంట్‌లో తేడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల గురించి ఆదాయపన్ను శాఖకు ఎస్ఎస్టీ పోలీసులు సమాచారం చేరవేశారు. ఛత్రపతి సాంబాజినగర్, అహ్యనగర్, జల్గావ్ జిల్లాల్లో ఆ ఆభరణాలను డెలివరీ చేయాల్సి ఉందన్నారు.దక్షిణ ముంబైలోని ఓ వాహనం నుంచి సుమారు 11 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని ఎస్ఎస్టీ పోలీసులు సీజ్ చేశారు.

రాజన్న దేవాలయంలో కార్తీక శోభ..

టీ మీడియా, నవంబర్ 2 ,వేములవాడ :
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయంలో కార్తికమాసం తొలిరోజు కావడంతో ధర్మగుండ పుష్కరిలో పుణ్యస్నాల ఆచరించి శనివారం తెల్లవారుజాము నుంచి మహిళలు, భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కంటి సన్నిధిలో మహిళలు దీపాలు వెలిగించి, బ్రాహ్మణులకు దీపదానం చేశారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణ మండపంలో కార్తిక పురాణ ప్రవచనాల పారాయణం నిర్వహించారు. రాజన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం సామూహిక కార్తిక దీపోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. ఎప్పటికప్పుడు అధికారులను దేశానిర్దేశం చేస్తూ దేవాలయ ఈవో వినోద్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటమడుతున్న యాజమానులు

- 25 రోజులుగా తెరచుకొని పరిశ్రమలు..
- గేటు ముందు కార్మికుల నిరసన

టీ మీడియా, నవంబర్ 2 ,తంగళ్ళపల్లి:
25 రోజులుగా టెక్స్ టైల్ పార్క్ వస్త్ర పరిశ్రమలు ప్రారంభించక కార్మికుల జీవితాలతో యజమానులు చెలగాటమాడుతున్నారని సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ మండిపడ్డారు. తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్ టైల్ పార్కు గేటు ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులందరూ తమ సమస్యలు పరిష్కరించాలని శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%%%అడ్డ మీద కూలీల కంటే అధ్వానంగా టెక్స్ టైల్ పార్క్ కార్మికుల బ్రతుకులు మారాయన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి టెక్స్ టైల్ పార్కులో పూర్తిస్థాయిలో పరిశ్రమలను ప్రారంభించి నిరంతరం ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల శాశ్వత ఉపాధి కల్పన కోసం గత 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన టెక్స్టైల్ పార్కులో యజమానులు తరచూ పరిశ్రమలను మూసివేసి, కార్మికులను రోడ్డున పడేసి, ఉపాధి పేరుతో కార్మికుల బతుకులను అడ్డం పెట్టుకొని సమస్యలు పరిష్కరించుకుంటూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు ఆర్డర్లను నడిపించకుండా కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడి పరిశ్రమలను నడిపిస్తూ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, టెక్స్టైల్ పార్క్ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కూచన శంకర్, ఆడెపు శుభ శేఖర్, దూస రాజమల్లు, ఆడేపు రవి, సంపత్, శ్రీనివాస్, ఆంజనేయులు, వరప్రసాద్, రంగయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, ఆంజనేయులు, రమేష్, అశోక్, రాజు కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గు బకాయిలను చెల్లించండి

-ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్

టీ మీడియా, నవంబర్ 2, రాంచీ : జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నేడు, రేపు ఆ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి మోడీ పాల్గొననున్నారు. దీంతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ జార్ఖండ్ రాష్ట్రానికి రావాల్సిన 1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలను చెల్లించమని మోడీని, అమిత్‌షాను కోరారు. ఈమేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నేడు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రేపు ప్రధానమంత్రి మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు జార్ఖండ్ కు రానున్నారు. ఈ సందర్భంగా జార్ఖండ్ లకు చెల్లించాల్సిన రూ. ఒక లక్షా 36 వేల కోట్ల బకాయిలను తిరిగి చెల్లించాలని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నాను. జార్ఖండ్ రాష్ట్రానికి, జార్ఖండ్‌లకు కేంద్రం నుంచి రావాల్సిన ఈ డబ్బు ఎంతో అవసరం' అని సోరెన్ ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టుకు జతగా ఆయన బొగ్గు బకాయిల చెల్లింపులపై ప్రధాని నరేంద్రమోడీకి రాసిన లేఖను పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆ రాష్ట్రంలోని బిజెపి నేతలను, ఎంపీలను కూడా బకాయిల చెల్లింపులో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కాగా, రాష్ట్రాభివృద్ధికి ఆటకంకమైన ప్రధాన సమస్యను మీ దృష్టికి తెస్తున్నాను. లోకల్ కంపెనీలు 1.36 లక్షల కోట్ల బకాయిలు చెల్లించాలి. మైనింగ్ అండ్ రాయల్టీ బకాయిల్ని చెల్లించే రాష్ట్రాల జాబితాలో జార్ఖండ్ కూడా ఉందని తొమ్మిది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు బెంచ్ ఇటీవల తీర్పు కూడా చెప్పింది. ఈ బకాయిల్ని చెల్లిస్తే రాష్ట్రాభివృద్ధికి దోహదపడు తుందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బొగ్గు బకాయిలకు సంబంధించి ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. విద్య, ఆరోగ్యం, స్త్రీలు-శిశు అభివృద్ధి, స్వచ్ఛమైన తాగునీరు వంటి ప్రాజెక్టులకు నిధుల కొరత వల్ల ఆటంకం మేర్పడింది. బకాయిల్ని చెల్లిస్తే.. ఈ ప్రాజెక్టుల అమలుకు దోహదపడుతుంది అని సోరెన్ లేఖలో పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే ఫ్యామిలీలో నలుగురు మృతి

టీ మీడియా, నవంబర్ 2 ,మెదక్ : జిల్లాలోని మనోహరాబాద్ మండలం పోతారం వద్ద శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. బైక్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు.పోతారం గ్రామానికి చెందిన మన్నె ఆంజనేయులు అనే వ్యక్తి తన మరదలు లత, ఆమె ఇద్దరు పిల్లలు సహస్ర, సాన్విలతో కలిసి బైకుపై శభాష్ పల్లి వైపు వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లత, ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందాడు.స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు

ప్రైవేట్ బస్సును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

-30 మంది కి పైగా గాయాలు

టీ మీడియా, నవంబర్ 2 ,కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని 65 నెంబర్ జాతీయ రహదారిపై కట్టకోమ్ముగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా గాయాలు బాగా వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుంచి (రాజమండ్రి) గోకవరంకు ప్రయాణికులతో వెళుతున్న మహి ట్రావెల్స్ బస్సు కోదాడ సమీపంలోకి రాగానే ప్రయాణికులు వాష్ రూమ్ కి వెళ్తా అనడంతో రహదారి పక్కన బస్సు ఆపడంతో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోనే ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి గాయాలైన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి 25 మందిని తరలించారు. ప్రయాణికులలో వెంకటేశ్వరరావు, కే మణి, డానియేలు, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు వైద్యశాల తరలించారు. నవ్య, ఆదిత్య, తేజ, డేవిడ్ కోదాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు వీరి పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. కోదాడ పరిధిలో ఇటీవల రహదారి ప్రక్కన భారీ వాహనాలు నిలపడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి ప్రక్కన భారీ వాహనాలను నిలపకుండా చూడాలి అని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తీరు వివరాలను పోలీసులు పరిశోధిస్తున్నారు.